క్లుప్తంగా

మే 1న పుస్తక ప్రదర్శన

అద్దంకి రూరల్: స్థానిక కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో మే1న కళాశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వీ. మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యాపకుడు జీ. శివప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఎంపీడీవోగా కృష్ణ

అద్దంకి రూరల్: బలికురవ ఎంపీడీవోగా పనిచేస్తున్న సీహెచ్ కృష్ణ శుక్రవారం సంతమాగులూరు ఎఫ్ఏసీ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

నేడు కారంచేడులో 'మా నమ్మకం నువ్వే జగన్'

కారంచేడు: 'మా నమ్మకం నువ్వే జగన్'–జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శనివారం కారంచేడు నుంచి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు గ్రామంలో అద్దంకి నాంచారమ్మ తల్లి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి విలేరకర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యే ఆమంచికి ఘన స్వాగతం పలకనున్నారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు, పర్చూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జువ్వా శివరామప్రసాద్, దగ్గుబాటి రామకృష్ణల ఆధ్వర్యంలో సుమారు 500 ద్విచక్రవాహనాలు, 100 కార్లతో భారీ ర్యాలీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఉదయం 9 గంటలకు కారంచేడు కాలువ సెంటర్‌కు చేరుకోవాలని ప్రకటనలో వారు విజ్ఞప్తి చేశారు.

గుండెపోటుతో యువకుడి మృతి

వేటపాలెం: జాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవానికి వచ్చి గుండెపోటుతో యువకుడు మృతి చెందాడు. ఈఘటన మండల పరిధిలోని కఠారివారిపాలెం మత్స్యకార గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామంలో రాత్రి జాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం జరిగింది. తిరునాళ్ల చూడటానికి చీరాల రూరల్ మండలం పిట్టువారిపాలెం నుంచి యువకుడు శ్రీనివాసులు (37) వచ్చాడు. అయితే శుక్రవారం ఉదయం విగత జీవిగా శ్రీనివాసులు పడి ఉన్నాడు. గ్రామస్తులకు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని చూడగా యువకుడు మృతి చెంది ఉన్నాడు. యువకుడు గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా రత్నకుమారి

యద్దనపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా గంజిమాల రత్నకుమారి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన బ్రహ్మానందం బదిలీపై వెళ్లారు. దీంతో సాధారణ బదిలీల్లో భాగంగా ఇంటర్ బోర్డు కమిషనర్ రత్నకుమారిని ప్రిన్సిపల్‌గా నియమించారు. ఈమె గతంలో పర్చూరు బీఏ ఆర్‌టీఏ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

చీరాల అర్బన్: మండలంలోని ఈపూరుపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చీరాల రూరల్ ఎస్సై జనార్దన్ శుక్రవారం విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అర్థమయ్యే రీతిలో దృశ్య రూపంలో చిత్రాలను ప్రదర్శిస్తూ ప్లకార్డుల రూపంలో వివరించారు. తాకకూడని చోట ఎవరైనా తాకితే భయపడకుండా డోంట్ టచ్ మీ అని గట్టిగా అరిచేలా తర్ఫీదు ఇచ్చారు. దేశంలో నానాటికి బాలికల మీద పెరుగుతున్న దాడులు దృష్టిలో పెట్టుకొని పోక్సో చట్టాలను తీసుకుని వచ్చారన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ మహిళా కానిస్టేబుల్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులూ ఇటు చూడరూ !

- అధ్వానంగా దండుబాట ప్రధాన మురుగు కాలువ
- స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నా పట్టని అధికారులు



అధికారుల తీరును నిరసిస్తున్న ఐక్యనగర్ ప్రజలు (ఫైల్)

చీరాల రూరల్: అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సామాన్య జనం ఇబ్బందుల పాలవుతున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మిన్నకుండిపోతున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. దండుబాట రోడ్డులోని ప్రధాన మురుగుకాలువ అధ్వానంగా తయారయ్యింది. దీంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి ఆయా పరిసరాలన్నీ ముక్కుపుటాలదిరే కంపుకొడుతున్నాయి. కాలువకు సమీపంలో నివాసముంటున్న ప్రజలు నిత్యం దోమలతో అల్లాడిపోతున్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన పశుపోషకులు తమ పశువులను పొలాల్లో మేతకు ఈ మురుగు కాలువను దాటుకొని తీసుకెళ్లాల్సిందే. అయితే కదలని మురుగు ఏపుగా పెరిగి గుర్రపుడెక్కతో కాలువ నిండుకొని ఉండడంతో అప్పుడప్పుడు కొన్ని పశువులు మృత్యువాతకు గురైన ఘటనలు అనేకం ఉన్నాయి. సమస్యకు పరిష్కారం చూపండని సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు అధికారులను అనేకసార్లు వేడుకున్నా వారిలో ఎటువంటి స్పందనలేకపోవడంతో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.



కాలువకు రెండువైపులా సిమెంట్ నిర్మాణాలు లేకుండా పారుతున్న మురుగు



పేరుకుపోయిన ప్లాస్టిక్, వ్యర్థాలు

సగం చేసి వదిలేశారు..

చీరాల పట్టణంలో నుంచి మురుగు నీరు బయటకు వెళ్లేందుకు పట్టణ శివారు ప్రాంతమైన దండుబాట రోడ్డులోని చీరాల రూరల్ కొత్తపాలెం మీదుగా శ్రీరాంనగర్, బలహీనవర్గాల కాలనీ, విఠల్ నగర్, జవహర్ నగర్, పాలేటి నగర్, ఎఫ్‌సీఐ గోడౌన్‌ల వరకు ప్రధాన మురుగు కాలువ నిర్మించారు. కొంత వరకు కాలువపై స్లాబులు వేసి మరికొంత కాలువపై స్లాబులు లేకుండా వదిలేశారు. ఇది కొంతవరకు బాగుంది. కానీ అసలు సమస్య ఇక్కడ నుంచే ప్రారంభమయ్యింది. కారంచేడు రోడ్డులోని ఎఫ్‌సీఐ గోడౌన్ నుంచి ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువలోకి (సుమారుగా రెండు కిలో మీటర్లు పొడవు) గల మురుగు నీరు పంపించేందుకు కాలువ అయితే నిర్మించారు. కానీ కాలువకు అడుగు భాగంలో సిమెంట్‌తో బెడ్డు వేయకుండా కాలువకు రెండువైపులా వదిలేశారు. దీనికి తోడు కాలువలో నీరు పారుదల కాకుండా తూటు కాడలు విపరీతంగా పెరిగిపోయాయి. అందు వలన మురుగు నీరు ముందుకు కదలటం కష్టతరంగా మారింది.

దోమలకు ఆవాసాలుగా...

కాలువలో తూటుకాడలు పెరిగిపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా మురుగు నీరు పాదులకు అడ్డుపడడంతో కాలువలో నీరు పారుదల నెమ్మదించింది. తద్వారా ఆయా ప్రాంతాలన్నీ కంపుకొడుతున్నాయి. సాయంత్రం ఆరు గంటలయితే ఆయా ప్రాంతాల్లో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

అధికారుల చర్యలు శూన్యం...

దండుబాట ప్రధాన మురుగు కాలువకకు శాశ్వత పరిష్కారం చూపమని సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు అనేకసార్లు మున్సిపల్ అధికారులను కలసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కాలంలో వరుసగా పట్టణ అభివృద్ధి సాధన సమితి పేరుతో నాయకులు అధికారులను పలు దఫాలుగా కలసి ఆయా సమస్యపై చర్చించారు. ఇంతవరకు ఎటువంటి కదలిక రాలేదని సమితి సభ్యులు చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పట్టించుకుని పరిష్కారం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నాం..

దండుబాట రోడ్డు ఎఫ్‌సీఐ గోడౌన్‌ల వద్ద మురుగు సమస్య ఉన్నమాట వాస్తవమే. అయితే కాలువ నుంచి వచ్చే మురుగునీటిని డైరెక్ట్‌గా ఈపురుపాలెం స్ట్రయిట్ కాలువలోకి వెళ్లకుండా జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రూ. 8 కోట్లతో గోడౌన్‌ల వద్దనున్న మున్సిపల్ స్థలంలో నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నాం. నీటిని శుద్ధి చేసిన తరువాతనే కాలువలోని నీటిని వదులుతాం

– ఏసయ్య, మున్సిపల్ డీఈ

వినతి పత్రాలు అందించాం..

ఎఫ్‌సీఐ గోడౌన్‌ల వద్ద నుంచి ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువలోనికి మురుగు నీరు వెళ్లకుండా ఆ కాలువను పూర్తిగా మూసివేయాలి. ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద నుంచి నేరుగా కారంచేడు రోడ్డులోని మురుగు కాలువలోని పంపించే ఏర్పాటు చేస్తే ప్రజలకు, రైతులకు ఎటువంటి సమస్యలు ఉండవు. ఈ విషయమై అనేక సార్లు మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు అందించాం.

– శీలం రవికుమార్, చీరాల అభివృద్ధి సాధన సమితి సభ్యుడు

వైభవంగా జాలమ్మ తిరునాళ్ల



స్వామివారి పల్లకి మోస్తున్న వెంకటేష్

వేటపాలెం: మండల పరిధిలోని కఠారివారిపాలెం మత్స్యకార గ్రామంలో నాలుగు రోజులుగా జరుగుతున్న జాలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ శుక్రవారం పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం వెంకటేశ్వరస్వామి వారి పల్లకి ఊరేగింపు కార్యక్రమంలో వెంకటేష్ పల్లకి మోశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద కాపులు కే వెంకటేశ్వర్లు, కఠారి తిరుపతయ్య, కొండూరి బాబు పాల్గొన్నారు. పందిళ్లపల్లిలో జరుగుతున్న ఎల్లమ్మ అమ్మవారి 24వ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో రొండా భరత్, సాదు రాఘవ, ఆవుల అశోక్, బొడ్డు సుబ్బారావు, దంత హనుమంతరావు, శ్యామ్, కీర్తి వెంకట్రావు, పేరక ఆనందం, పిచ్చుక శ్రీనివాసరావు, పింజల హేమసుందర్, సురేష్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్

కారంచేడు/చినగంజాం: పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం కారంచేడు అంబేడ్కర్ నగర్ కాలనీలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విశేష కృషి చేస్తున్న అనేక మంది కార్యకర్తలకు తాను ఎల్లప్పుడు అండగానే ఉంటానన్నారు. ఏ అవసరమైనా తనను కలవచ్చాన్నారు. గ్రామానికి చెందిన గర్నెపూడి రత్నరాజుకు చెందిన నూతన గృహాన్ని ఆయన ప్రారంభించి కార్యకర్తలతో ముచ్చటించారు. కార్యక్రమంలో గర్నెపూడి ప్రసాదు, కుమ్మరి నాగేశ్వరరావు, బడుగు మోజెస్, యార్లగడ్డ పాపారావు, సొసైటీ అధ్యక్షుడు పులి గంగరాజు, దగ్గుబాటి రామకృష్ణ, బొబ్బేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు ఉప్పలపాటి అనీల్, చీరాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కనపర్తి బుజ్జిబాబు, చీరాల మున్సిపల్ కౌన్సిలర్ వై సునీల్, విజయభాస్కరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు సత్వరం చర్యలు తీసుకొని పూర్తి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్ అన్నారు. ఇటీవల మండలంలోని పెదగంజాం, కొత్తపాలెం పంచాయతీ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలిచ్చిన అర్జీలకు సంబంధించి శుక్రవారం మండల పరిషత్ సమావేశం మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమనేత లూకయ్య మృతి

చీరాల రూరల్: ఉపాధ్యాయ రంగంలో ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఉపాధ్యాయ ఉద్యమ సీనియర్ నాయకుడు పంది లూకయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. 1974లో ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన రిటైర్‌మెంట్ వరకు యూటీఎఫ్ ఫౌండర్‌గా, సభ్యుడిగా నాయకుడిగా వివిధ హోదాల్లో పనిచేసి సంఘ అభివృద్ధికి కూడా పాటుపడ్డారు. అలానే యూటీఎఫ్‌లో పనిచేస్తునే జనవిజ్ఞాన వేదికలో 1998 నుంచి పనిచేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీలకు చెందిన నాయకులు లూకయ్య మృత దేహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

చీరాల రూరల్: రబీసాగు ధాన్యం పంటను కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి కొనుగోలు షెడ్యూలు విడుదల చేసినట్లు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఈపురుపాలెం ఆర్‌బీకే–3 రైతు భరోసా కేంద్రం పరిధిలోని కర్నేటి శ్రీనివాసరావు, సయ్యద్ సుభాని రైతుల ధాన్యం పరిశీలించిన తురువాత షెడ్యూలు ఇచ్చినట్లు రమణారెడ్డి తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర క్వింటాల్‌కు రూ. 2060 మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. అయితే తేమ శాతం 17 ఉండాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారానే గోతాలు, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బిట్రా శ్రీనివాసరావు, మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్, రైతులు, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల్లో ప్రగతి తప్పనిసరి

చినగంజాం: నాడు–నేడు పనుల్లో ప్రగతిని ఎప్పటికప్పుడు కనబరచాలని ఎంఈవో డీ గంగాధర్ సూచించారు. మండల విద్యావనరుల కేంద్రంలో నాడు–నేడు హెచ్‌ఎంల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ చినగంజాం మండలం నాడు–నేడు ఖర్చు విషయంలో జిల్లాలో 12వ స్థానంలో ఉందని, ఇప్పటివరకు రూ. 281.6 లక్షలు విడుదల కాగా రూ.203.98 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన జూన్ 5వ తేదీలోపు విడుదలైన నిధులు పూర్తికావాలన్నారు. సమగ్రశిక్ష అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటరావు మాట్లాడుతూ టాయిలెట్‌లు, కిచెన్‌షెడ్, ముఖ్యమైన పనులు, విద్యుత్ పనులు పూర్తయిన తరువాత అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌లు రత్నకుమారి, దేవదత్తం, ప్రసన్నకుమారి, శ్రీనివాసరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సీఆర్పీలు సురేంద్ర, ఆశిష్, సునీల్, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

కారంచేడు: రోడ్డు భద్రత–ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కారంచేడు ఎస్సై బీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన కారంచేడు–చీరాల మధ్యన ఉన్న ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగి ఉన్న చిల్లచెట్ల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురువారం చిలకలూరిపేట నుంచి చీరాల వస్తూ మలుపులో అదుపుతప్పి కారు కాలువలోకి దూసుకెళ్లిన విషయం పాఠకులకు విదితమే. ఈ రోడ్డులో చిన్న, పెద్దచప్టాల వద్ద ప్రమాదాల నివారణకు ఇప్పటికే బారీకేడ్లు ఏర్పాటు చేశామన్నారు. వాహదారులు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

మా పనితీరే మా విజయానికి రక్ష



పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వెంకటేష్, నాయకులు

- చీరాలలో 'జగనన్నే మా భవిష్యత్ విజయోత్సవ ర్యాలీ
- భారీగా పాల్గొన్న పార్టీ శ్రేణులు

చీరాల: మా పనితీరే మా విజయానికి రక్షణగా ఉంటాయని చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం విజయవంతం కావడంతో శుక్రవారం చీరాలలో ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో పార్టీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ స్థాయిలో పాల్గొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి విజయోత్సవాన్ని నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 7న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారని, ప్రభుత్వంపై ప్రజలు ఎలా ఆలోచిస్తున్నారో జనాభిప్రాయ సేకరణ చేశామన్నారు. గడప గడపకు తిరిగే సమయంలో నాయకులను, అధికారులను కలుపుకుని ప్రజలు ఏమైనా సమస్యలు తెలిపితే సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఏమేరకు ప్రజలకు అందుతున్నాయో ప్రజల మాటల్లోనే తెలుసుకున్నామన్నారు. నియోజకవర్గంలో అన్ని సమస్యలను దాదాపుగా పరిష్కరించామన్నారు. ఇంకా ఏవైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ర్యాలీలో భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

గెలుపే లక్ష్యంగా పోటీల్లో రాణించాలి

వేటపాలెం: క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో రాణించాలని చీరాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ బండ్ల బాపయ్య హిందూ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో కరణం యువసేన ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన రెడ్ టెన్నిస్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను వెంకటేష్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా చీరాల నుంచి వేటపాలెం వరకు భారీగా యువకులతో కలసి క్రీడా మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో యువకులు క్రీడలపై మక్కువ చూపుతుంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ పోటీలకు మంచి స్పందన వచ్చిందని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. స్వయంగా కొంత సేపు క్రికెట్ ఆడి అభిమానులను ఆనందింపజేశారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 24 టీంలు వచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పులి వెంకటేశ్వర్లు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎస్ రాజకుమార్, బండి కళ్ల నరేష్, రొండా భరత్, ఆవుల అశోక్, సాధు రాఘవ, మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, జార్జి శ్యామ్యూల్, మోజస్, బొడ్డు సుబ్బారావు, డీ హనుమంతరావు, జమ్మి ప్రసాద్‌రెడ్డి, ఖాదర్, రమేష్, పులి హరికృష్ణ, కొండ్రు బాబ్జీ, కోలా శివ, షేక్ రియాజ్, షేక్ మహమూద్, మల్లీ హరీష్, గోలి గంగాధర్, వాసిమల్ల వాసు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల: చీరాల పట్టణ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేసి పురోగతి సాధించాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ హాలులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన 14, 15 ఆర్థిక సంఘం, గడప గడపకు మన ప్రభుత్వం, సీఎండీఎఫ్, సాధారణ నిధులకు సంబంధించిన అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డీఈ ఏసయ్య, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అసిస్టెంట్ ఇంజనర్లు, సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: ప్రజా సంక్షేమం–అభివృద్ధే ధ్యేయంగా కృత నిశ్చయంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కొప్పరపాలెం గ్రామం, ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల అమలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరు తెలుసుకున్నారు. నాలుగేళ్లగా జగనన్న పాలనలో పొందిన లబ్ధిని లబ్ధిదారుల నుంచి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. జగనన్నను 2024 ఎన్నికల్లో నిండు మనసుతో ఆశీర్వదించి రెండో సారి సీఎంగా చూడాలని ప్రజలకు విన్నావించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, స్థానిక నేతలు వల్లంరెడ్డి అంజిరెడ్డి, గన్నమనేని వెంకటరామిరెడ్డి, సీతారెడ్డి, జక్కం అంజిరెడ్డి, పెద్దిరెడ్డి కోటిరెడ్డి, ప్రత్తిపాటి అంకయ్య, కోయలమూడి ఏసోబు, బండారు పిచ్చయ్య, కంభంపాటి భూషయ్య, కొండెద్దు వీరనారాయణ, యత్రాకుల వెంకటేశ్వర్లు పీ. నరేష్, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, ఈవోర్డీ జీ. సీతామహాలక్ష్మీ, వెలుగు ఏపీఎం డీ. సురేంద్రబాబు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.